క్లుప్తంగా

ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వకు సన్మానం



ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఉరవకొండ: స్థానిక లక్ష్మీనృసింహస్వామి కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి స్వగృహంలో సోమవారం కలిసి ఆయన్ను సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో రాత్రింబవళ్లు ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. ఈసారి ఉరవకొండ నుంచి మంచి మెజార్టీతో తాను గెలవబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కుడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండో సారి అధికారం చేపట్టనుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిని సత్కరించిన వారిలో జేసీబీ రామకృష్ణ, ఆరె రాజ తదితరులు ఉన్నారు.

24న సర్వసభ్య సమావేశం

విడపనకల్లు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఈనెల 24న మండల సర్వసభ్య సమావేశం ఉంటుంది. ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖాధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కొండయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న సీడీపీఓ వనజ అక్కమ్మ

కుందుర్పి: గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టి, ఆడబిడ్డల భవిష్యత్తును కాపాడుదామని ఐసీడీఎస్ సీడీపీఓ వనజ అక్కమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని జంబుగుంపల గ్రామంలో బాల్యవివాహాలను అరికడదాం – ఆడబిడ్డలను కాపాడాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో బాల్య వివాహాల నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సర్పంచ్ గంగాధర, ఆర్టీటీ టీం లీడర్ నారాయస్వామి, మహిళా పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రాయదుర్గం రూరల్: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ తెలిపారు. ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచులతో పాటు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

కుందుర్పి పీహెచ్‌సీని తనిఖీ చేసిన పీఓ

కుందుర్పి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ సుజాత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సకాలంలో ప్రభుత్వ వైద్యం అందేలా సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. పలుగ్రామాల్లో ఆరోగ్య సబ్ సెంటర్లను నిర్మించి, సిబ్బంది స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జంబుగుంపల, బెస్తరపల్లి, మహంతపురం, అప్పిలేపల్లి ప్రజలు ఆమెకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ రవి శంకర్, వైద్యులు అనూషా, చాంద్ బేగం, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జరిగిన జాబ్ మేళాలో 50 మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పెనుకొండ సమీపంలోని సియాన్ (కియా అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళాకు డిప్లమో, బీటెక్, డిగ్రీ పూర్తి చేసిన 86 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఇంటర్వ్యూ అనంతరం సియాన్ కంపెనీ హెచ్‌ఆర్‌లు శివ, చందు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హర్ష సమక్షంలో 35 మందిని వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రాము, మెకానికల్ లెక్చరర్ అలీషా పాల్గొన్నారు.

ముంగారులో వర్షం.. అన్నదాతల్లో హర్షం

- రాయదుర్గం డివిజన్ వ్యాప్తంగా 336.6 ఎంఎం వర్షపాతం నమోదు



బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తిలో ఆదివారం రాత్రి కురిసిన వర్షం

రాయదుర్గం/కళ్యాణదుర్గం: మరో పది రోజుల్లో మే నెల ముగియనుంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదువుతూ ఎండలు మండుతున్నాయి. ఇన్నాళ్లు సార్వత్రిక ఎన్నికల్లో తలమునకలైన రైతులు, ప్రజలు ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొంత ఉపశమనం పొందుతున్నారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు డివిజన్ వ్యాప్తంగా 336.6 ఎం ఎం వర్షపాతం నమోదైంది. కుందుర్పిలో అత్యధికంగా 48.6 ఎంఎం , అత్యల్పంగా కళ్యాణదుర్గంలో 15.6 ఎంఎం గా నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. శెట్టూరు 42.4 ఎంఎం, కంబదూరు 32.6 ఎంఎం, బ్రహ్మసముద్రం 13.2 ఎంఎం, బెళుగుప్ప 48.4 ఎంఎం, రాయదుర్గం 22.0 ఎంఎం, డి హీరేహాళ్ 25.4 ఎంఎం , గుమ్మఘట్ట 32.4 ఎంఎం, కణేకల్లు 24.0 ఎంఎం, బొమ్మనహాళ్ 32.0 ఎంఎంగా నమోదైంది. మరోవైపు రైతన్నలు వేసవి దుక్కులు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం కూడా రాయితీతో విత్తన వేరుశనగ, ఎరువులు సిద్ధం చేసింది. ఆర్బీకేలకు సరఫరా చేస్తోంది. అధికారులు, సిబ్బంది విత్తన వేరుశనగ పంపిణీకి పేర్లు నమోదు చేసుకుంటున్నారు.

ముంగారులో మోస్తరు వర్షం

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షపాతం 48.4 ఎంఎంగా నమోదయ్యిందని ఏఓ పృథ్వీసాగర్ తెలిపారు. ఖరీఫ్ విత్తనసాగుకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో కే6 రకం వేరుశనగ 30 కిలోల ప్యాకెట్ రూ.1710, రెండు ప్యాకెట్లకు రూ.3420, 30 కిలోల మూడు ప్యాకెట్ల వేరుశనగకు రూ.5130 చొప్పున రైతులకు అందిస్తున్నామన్నారు.

కూడేరులో 34 ఎంఎం వర్షపాతం

కూడేరు: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి, సోమవారం వేకువజామున ఉరుములు, గాలితో కూడిన వర్షం కురిసింది. కొన్ని గ్రామాల్లో పొలాల్లో నీరు నిలిచింది. గతేడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 34 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైనట్లు మండల గణాంకాధికారిణి ఆశా తెలిపారు.

రాయితీ విత్తనం..సాగుకు సమాయత్తం



ఆమిద్యాల ఆర్‌బీకేలో విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ శుభకర్

ఉరవకొండ: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తన కాయలు అందుబాటులో ఉంచామని ఏఓ శుభకర్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని రాకెట్ల, ఆమిద్యాల గ్రామాల్లోని ఆర్‌బీకేలకు చేరిన వేరుశనగ విత్తనాల స్టాక్‌ను ఏఓ పరిశీలించారు. ముందుగా ఆర్‌బీకే వద్ద ఉన్న రైతులకు ఏఓ మంచి వర్షాలు పడుతున్నందున రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమిద్యాలలో రైతుల సమక్షంలో విత్తనకాయల నాణ్యతను పరిశీలించారు.



వజ్రకరూరులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ

విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌కు విశేష స్పందన

వజ్రకరూరు: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రాయితీ విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌కు స్పందన లభిస్తోంది. సోమవారం మండల కేంద్రంలోని రైతుభ రోసా కేంద్రంలో జరుగుతున్న రి జిస్ట్రేషన్ ప్రక్రియను ఏఓ మధుకర్ పరిశీలించారు. ఈసందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి, రైతుల నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీఏఏ సురేష్ నాయక్, ఎంపీహెచ్ఈఓ ప్రమీల,రైతులు తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరుకు చేరిన రాయితీ విత్తన కాయలు

వజ్రకరూరు: మండల కేంద్రానికి రాయితీ విత్తన వేరుశనగ కాయలు సోమవారం చేరాయి. విత్తన వేరుశనగను ఏఓ మధుకర్ పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ మండలానికి ఇప్పటి వరకు 230 క్వింటాళ్ల విత్తన వేరుశనగ వచ్చిందన్నారు. రైతులకు 40 శాతం రాయితీతో ఈనెల 24 నుంచి వేరుశనగ విత్తనకాయలు అందించనున్నట్లు తెలిపారు. ఈనెల24వతేదీ నుంచిరాయితీవేరుశనిగ విత్తనాల పంపిణీ ప్రార ంభంకానున్న ట్లు ఏఓ వెల్లడించారు. వేరుశనగ విత్తన కాయలతోపాటు కందులు, పిల్లిపెసర, దైంచా, జనుము (పచ్చిరొట్టె ఎరువు) తదితర వాటిని కూడా అందించనున్నట్లు తెలిపారు.



విడపనకల్లులో మాట్లాడుతున్న ఏడీఏ పద్మజ



బ్రహ్మసముద్రంలో నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రారంభమైన వేరుశనగ రిజిస్ట్రేషన్లు

కంబదూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఏఓ జాఫర్ తెలిపారు. కంబదూరు మండలానికి 3వేల క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఇందులో కే-6 రకం 2,800 క్వింటాళ్లు, కదిరిలేపాక్షి రకం 100 క్వింటాళ్లు, టీసీజీఎస్-1694 రకం 100 క్వింటాళ్ల చొప్పున కేటాయించినట్లు తెలిపారు.

ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ

బ్రహ్మసముద్రం : అర్హులైన ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు ఏఓ సరిత అన్నారు. సోమవారం మండలానికి 4,300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ ను కేటాయించినట్లు తెలిపారు. విత్తనం కావాల్సిన రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఇసుక రీచ్‌లను పరిశీలించిన అధికారులు



వేపరాల ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం రూరల్: వేపరాల, జుంజురాంపల్లి గ్రామాల పరిధిలోని వేదావతి నది పరీవాహక ప్రాంతంలోని ఇసుక రీచ్‌లను మైనింగ్ ఏడీ వెంకటేశ్వరావు, డీపీఓ ప్రభాకర్‌రావు , ఆర్డీఓ రాణీ సుస్మిత, డీస్పీ శ్రీనివాసులు, సెబ్ డీఎస్పీ శ్రీరామ్ సోమవారం పరిశీలించారు. మైనింగ్ అధికారులు నిర్దేశించిన కొలతల్లోనే ఇసుక తవ్వకాలు చేసేందుకు టెండర్‌దారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని వారు తెలిపారు. ఇసుక తరలింపులో లారీలు, ట్రిప్పర్లపై కచ్చితంగా తార్పాలిన్లు కప్పాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ అల్లాబకాష్ , ఈఓపీఆర్డీ రంగనాయకులు, సీఐ శ్రీనివాసులు , సెబ్ సీఐ మురళీమోహన్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎస్ఐ పరుశురాముడు

బ్రహ్మసముద్రం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా గొడవలు, అల్లర్లు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎస్ఐ పరుశురాముడు హెచ్చరించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎలాంటి ఘటనలూ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ , ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో ఫారంపాండ్లు తవ్వించాలి



కూడేరు: మాట్లాడుతున్న ఏపీడీ విజయలక్ష్మి

కూడేరు: ప్రతి పంచాయతీలో ఐదు ఫారంపాండ్లు తవ్వించాలని డ్వామా ఏపీడీ విజయ లక్ష్మీ మండల సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆమె మండల ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. పనుల కల్పన, పనులకు వెళ్తున్న ఉపాధి కూలీల గురించి ఆరా తీశారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ ఫారంపాండ్లు తవ్వడం ద్వారా వర్షం నీరు అందులో నిల్వ ఉండి బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతుల పొలాల్లో ఫారంపాండ్లను తవ్వించాలన్నారు. రైతులను ఒప్పించి ప్రతి పంచాయతీలో ఐదు ఫారంపాండ్లు తవ్వాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా ఉపాధి పనులకు రోజుకు 4 వేల మంది కూలీలు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఈసీ రవి కుమార్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ రమావత్‌దేవి

వజ్రకరూరు: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక స్త్రీశక్తిభవనంలో ఎంపీపీ రమావత్‌దేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రమావత్‌దేవితోపాటు వైస్ ఎంపీపీ సుశీలారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుశీలమ్మ, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి ,పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో గూళ్యపాళ్యం గ్రామంలో విద్యుత్‌వైర్లు దెబ్బతినడంతో ఇళ్లకు విద్యుత్ సక్రమంగా సరఫరా కాలేదని, వెంటనే సమస్య పరిష్కరించాలని సభ్యులు కోరారు. ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని, అడిగిన ప్రతి కూలీకీ పనులు కల్పించాలని అధికారులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిఇలా ఉండగా ఈ సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ విజయలలిత, ఎంఈఓ ఎర్రిస్వామి, సర్పంచులు మోనాలిసా, జయేంద్రరెడ్డి, మల్లెల జగదీష్, సురేంద్ర, శ్రీనివాసరెడ్డి, కురుబ లక్ష్మయ్య, కురుబ తిరకమ్మ, భూమా కమలమ్మ,క వితాబాయి, మూరిన్ని ధనలక్ష్మి, ఎంపీటీసీలు ఫిరోజ్ బాను, నాగలక్ష్మి, మునయ్య, ముద్దయ్య, రామకృష్ణ, తిమ్మారెడ్డి, పీఆర్ ఇంజనీర్ మణిభూషణ్ పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి



డెంగీ నిర్ధారణ కిట్లను పంపిణీ చేస్తున్న మెడికల్ ఆఫీసర్

ఉరవకొండ: గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ ఎల్లోజి ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఉరవకొండ డివిజన్‌లోని పీహెచ్‌సీలకు డెంగ్ నిర్ధారణ కిట్లను పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో డెంగీ నిర్ధారణ కిట్లు అందించారు.

ఎస్ఎస్‌వన్ కిట్లు పంపిణీ

విడపనకల్లు: మండలంలోని పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్లు, పాల్తూరు పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఎస్‌వన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పెన్నహోబిలానికి చేరిన శ్రీవారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం



శ్రీవారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భారీ ఊరేగింపు మధ్య శ్రీవారి ఉత్సవ మూర్తులను ఆమిద్యాల నుంచి భక్తులు పెన్నహోబిలానికి చేర్చారు. ఆమిద్యాల గ్రామంలోని పెన్నోబుళేసుడి ఆలయంలో శ్రీవారి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పల్లకీలో ఉంచి మేళతాళాల మధ్య బాణాసంచా పేలుస్తూ ఊరేగింపుగా పెన్నహోబిలం తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ఈఓ విజయ్ కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది.

నమో నారసింహా..

- నేడు లక్ష్మీ నరసింహస్వామి జయంతి
- కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయాలు



అలంకరణలో లక్ష్మీ నారసింహుడు

అనంతపురం కల్చరల్: రాష్ట్రంలోనే నరసింహస్వామి దేవాలయాలకు అనంత జిల్లా ప్రసిద్ధి చెందిందని పురాణ నేపథ్యం ఉంది. అందులో భాగంగానే కదిరి, పెన్నహోబిలం, సోమగట్ట, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో స్వామి విశేష పూజలందుకుంటున్నట్లే నగరంలోనూ నరసింహస్వామి కొలువుదీరి భక్తుల కొంగు బంగారంగా భక్తి నీరాజనాలందుకుంటున్నాడు. నగరం ఏర్పడిన తొలి రోజుల్లో పాతూరులో నిర్మాణమైన ఈ ఆలయంలో నరసింహ స్వామి జయంతి కన్నుల పండువగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. అలాగే రుద్రంపేట, కళ్యాణదుర్గం బైపాసు వద్ద ఉన్న నరసింహస్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి.

నేడు ప్రత్యేక పూజా కార్యక్రమాలు..

నరసింహస్వామి జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామికి అభిషేక, అలంకార సేవలు, మన్యుసూక్త హోమం శాస్త్రోక్తంగా జరుగనున్నాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరుగుతుంది. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవ వేడుకలు జరుగనున్నాయి. భక్తులందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ప్రతినిధులు నాగరాజు, రఘునాథా చార్ కోరారు.

బ్యాటిళ్లు, క్యాన్లలో పెట్రోలు, డీజిల్ విక్రయించొద్దు

కంబదూరు: ఖాళీ బాటిళ్లు, క్యాన్లలో లూజుగా పెట్రోల్, డీజిల్ విక్రయించొద్దని మండలంలోని పెట్రోల్ బంకుల యజమానులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి జూన్ 10వ తేదీ వరకూ ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నింబంధనలు పాటించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల నిఘా ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి పెట్రోల్ బంకు లైసెన్సు రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఖాళీ సీసాలు, క్యాన్లలో పెట్రోల్,డీజిల్ వేయబడదని స్టిక్కర్లను బంకుల వద్ద అతికించాలని సూచించారు.

మేధాశక్తిని పెంపొందించేందుకే సమ్మర్ క్యాంప్



సొంత ఊరు గొప్పతనంపై వివరిస్తున్న గ్రంథాలయాధికారిణి రాధారాణి

కూడేరు: విద్యార్థులు వేసవి సెలవుల్లో కాలాన్ని వృథా చేయకుండా వారిలో మేధాశక్తిని పెంపొందించేందుకే గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపును నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారిణి రాధారాణి తెలిపారు. సమ్మర్ క్యాంపులో భాగంగా సోమవారం కూడేరులోని గ్రంథాలయంలో పిల్లలకు సొంతూరు గొప్పతనంపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జరుట్ల రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో జరుట్ల రామలింగేశ్వరస్వామి

వజ్రకరూరు: మండలంలోని జరుట్ల రాంపురంలో జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, రుద్రాభిషేకం , మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. అదే విధంగా వజ్రకరూరులోని భోగేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు.

నేడు నరసింహస్వామి జయంతి

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం పరిధిలో వెలిసిన విప్రమలై లక్ష్మీ నవనరసింహ స్వామి ఆలయంలో నరసింహ జయంతి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నట్లు తెలిపారు. 10 గంటలకు లక్ష తులసీ అర్చన చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం స్వామి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం 9 గంటలకు స్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

ఉపాధి పనులకు 4వేల మంది కూలీలు హాజరు



మాట్లాడుతున్న ఏపీఓ లక్ష్మీకాంతబాయి

వజ్రకరూరు: మండలంలో ఉపాధిహామీ పనులకు నాలుగు వేల మంది కూలీలు హాజరవుతున్నట్లు ఏపీఓ లక్ష్మీకాంతబాయి తెలిపారు. సోమవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో పలు రికార్డులను ఏపీఓ పరిశీలించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి పనులకు ప్రస్తుతం మండల వ్యాప్తంగా నాలుగు వేల మంది కూలీలు హాజరవుతున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి కూలీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉపాధిహామీ కింద పారంపండ్, డకౌట్, బౌండ్రీట్రెం చులు, ఫీడల్ ఛానళ్లు, స్టాలాన్ ట్రెంచులు తదితర పనులు చేస్తున్నట్లు తెలిపారు. హార్టికల్చర్ కింద మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి కూలీకీ పనులు కల్పించనున్నట్లు తెలిపారు.

రబీ పంటల జాబితా సిద్ధం చేయండి



విడపనకల్లులో వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఏడీఏ పద్మజ

విడపనకల్లు: 2023లో రబీలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను సేకరించి, జాబితాను సిద్ధం చేయాలని మండల స్థాయి వ్యవసాయాధి కారులు, ఆర్‌బీకే సిబ్బందిని ఏడీఏ పద్మజ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యలయంలో ఏడీఏ వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. 2023 రబీలో రైతులు సాగు చేసిన పప్పుశనగ, కుసుమ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల వివరాలను తప్పులు లేకుండా జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పెన్నయ్య, ఆర్‌బీకే సిబ్బంది, ఎంపీఈఓలు, తదితరులు పాల్గొన్నారు.